క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): సమగ్ర గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ సాంబశివరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇస్తున్నాయన్నారు. నిధులకు సంబంధించి వివరాలను సర్పంచులు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దైవసేవకుల జీవనం ఆదర్శప్రాయంగా ఉండాలి



నందిగామ: దైవసేవకులు తప్పనిసరిగా సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కలిగి ఉండాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బొక్కా జార్జ్‌ముల్లర్ సూచించారు. పట్టణంలోని పాత బైపాస్‌రోడ్డులోగల షాలేము ప్రార్థన మందిరంలో గురువారం నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ నందిగామ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముల్లర్ మాట్లాడుతూ దైవసేవకులు బైబిల్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతూ ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా త్వరలో నిర్వహించనున్న సువార్త సభల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం పలువురు దైవసేవకులకు గుర్తింపు కార్డులను అందజేశారు. దైవ సేవకులు హనోక్ , జకరయ్య, మధుబాబు, కొండ, రాజారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ స్వరాజ్ మైదానంలోని స్మృతివనంలో శుక్రవారం జరుగనున్న 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అందరూ తరలిరావాలని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నందున ఈ కార్యక్రమానికి ప్రజలు తరలివెళ్లేందుకు జగ్గయ్యపేట నియోజకవర్గవ్యాప్తంగా 64 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల నుంచి మధ్యాహ్నం 12గంటల నుంచి బస్సులు బయలుదేరుతాయని వివరించారు. విగ్రహావిష్కరణ మహోత్సవానికి కులమతాల కతీతంగా పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జుజ్జూరు(వీరులపాడు): పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆర్డీవో సాయిబాబు సూచించారు. మండలంలోని జుజ్జూరులోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీరు, మరుగుదొడ్డి వసతితోపాటు ఓటర్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా వద్దులు, వికలాంగులకు వీలుగా ఉండేలా ర్యాంపులు ఏర్పాటు చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. తహసీల్దార్ ఆశయ్య నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎస్ కళాశాల విద్యార్థి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఇటీవల చండీఘర్‌లో నిర్వహించిన ఆలిండియా సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి సోను భార్గవ్ కృష్ణా విశ్వవిద్యాలయం తరుపున పాల్గొని పతకం పొందాడని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన సోను భార్గవ్‌ను, ప్రోత్సహించిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావును కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్ అభినందనలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

రిపబ్లిక్‌డే వేడుకలు వీక్షించేందుకు అవకాశం



మాట్లాడుతున్న విద్యాకన్నా, పూర్ణిమ, ఎంపికైన మహిళలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 26 న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించడానికి తమ సంస్థలో శిక్షణ పొందిన ఇద్దరు మహిళలు ఎంపిక అయ్యారని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా చెప్పారు. రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. విద్యాకన్నా మాట్లాడుతూ గత ఏడాదిలో జనశిక్షణ సంస్థాన్‌లో పీఎంకేవీవై 4.0 కోర్సులను నిర్వహించామని, అందులో అసిస్టెంట్ బ్యూటీ కన్సల్టెంట్స్ కోర్సులో వి.సీత, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సులో ఈ.రమణ పాల్గొని కోర్సులను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటుగా వెంటనే యూనిట్‌ను స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. పీఎంకేవీవై కోర్సుల్లో శిక్షణ పొంది, యూనిట్‌ను స్థాపించిన వారి సక్సెస్ స్టోరీలో నుంచి పీఎంకేవీవై అధికారులు వీరిని ఎంపిక చేశారని తెలియజేశారు. ఈ నెల 26వ తేదిన ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల పరేడ్‌లో వీరు పాల్గొని స్వయంగా వీక్షించడమే కాకుండా పీఎంకేవీవై అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వీరి సక్సెస్ స్టోరీని వివరిస్తారని తెలిపారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ పొందిన వారు గణతంత్ర వేడుకలను స్వయంగా వీక్షించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఊరు మారింది

- సీఎం జగనన్న పాలనలో అభివృద్ధిబాటలో నవాబుపేట
- రూ.10కోట్లతో అభివృద్ధి పనులు
- పెరిగిన మౌలికవసతులు

నవాబుపేట (పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నవాబుపేటలో అభివృద్ధికి బాటలుపడ్డాయి. సుమారు రూ.10కోట్లతో గ్రామానికి మౌలికవసతుల కల్పనతోపాటు పాఠశాలల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. దీంతో సీఎం జగన్ పాలనలో ఊరు మారిందని గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రూ.45లక్షలతో సచివాలయం..

మండలంలోని నవాబుపేటలో రూ.45లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21లక్షలతో రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) భవనాలు నిర్మించారు. ఈ భవనాలను త్వరలోనే ప్రారంభించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మారిన పాఠశాల రూపురేఖలు..

నాడు–నేడు పథకంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను రూ.30లక్షలతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా పాఠశాల వాతావరణాన్ని తీర్చిదిద్దారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సైతం పెరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని వ్యవసాయ పరపతి సహకారం సంఘ భవనం శిథిలావస్థకు చేరడంతో జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతో రూ.37.80లక్షలతో ఆధునిక హంగులతో నూతన భవనాన్ని నిర్మించారు.ఈ సొసైటీ ద్వారా రైతులు, డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం సహకరిస్తోంది.

రూ.9కోట్లతో తారురోడ్లు..

గ్రామంలో సుమారుగా రూ.69లక్షలతో పలు అంతర్గత రహదారులను సిమెంటురోడ్లుగా అభివృద్ధి చేశారు. అదేవిధంగా పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.6కోట్లతో నవాబుపేట-జయంతిపురం వరకు తారురోడ్డు నిర్మించారు. దీంతో మండలంలోని అనేక గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. మరో రూ.కోటితో నవాబుపేట నుంచి ముప్పాళ్ల వరకు తారురోడ్డును నిర్మించారు. నవాబుపేట నుంచి బెల్లం కొండవారిపాలెం వరకు తారురోడ్డు నిర్మాణానికి డీఎంఎఫ్ నిధులు రూ.2కోట్లు మంజూరు కాగా, పనులు చేపట్టేందుకు టెండర్లను పిలిచారు.

300 మందికి ఇళ్లస్థలాలు, ఇళ్లు..

నవాబుపేటలోని 300మంది పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు కేటాయించి, ఇళ్లు కూడా మంజూరు చేశారు. 300 లబ్ధిదారుల్లో ఇప్పటికే 100 మంది నూతన గృహనిర్మాణాలను పూర్తిచేసుకుని సొంతిళ్లలో ఉంటున్నారు. ఈ కాలనీల్లో అన్నిరకాల మౌలికవసతులు కల్పించడంతో మిగిలిన లబ్ధిదారులు కూడా అరకొరగా మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసుకుని నూతన గృహప్రవేశం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.



ఆలయం, కల్యాణ మండపానికి శ్రీకారం..

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10లక్షలతో నవాబుపేటలోని బీసీకాలనీలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. అలాగే రూ.40లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి కూడా స్థలాన్ని ఎంపిక చేశారు.

ఇలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో అభివృద్ధిపథంలో దూసుకుపోతూ తమ ఊరు మారిపోయిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునిక హంగులతో నవాబుపేట ప్రాథమిక పాఠశాల



నవాబుపేటలోని జగనన్న కాలనీ



ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం



పూర్తయిన రైతుభరోసా కేంద్రం భవనం



నవాబుపేట-జయంతిపురం రోడ్డు



గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్డు

అభివృద్ధికి చిరునామా..



నవాబుపేటలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వ భవనాల నిర్మాణంతో ఊరి రూపురేఖలే మారిపోయాయి. గ్రామసచివాలయం, ఆర్బీకేలను త్వరలోనే ప్రారంభిస్తాం. అభివృద్ధిని అందరూ అంగీకరిస్తున్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. నేను సర్పంచిగా ఉన్న సమయంలో గ్రామం ఇలా అభివృద్ధిపథంలో పయనిస్తుండటం సంతోషంగా ఉంది.

గొర్రెముచ్చు మేరీ, సర్పంచి

మరో ఊరు ఏర్పడుతోంది..



జగనన్న కాలనీల్లో 100మంది ఇప్పటికే ఇంటినిర్మాణాలు పూర్తిచేసుకోగా, మిగిలిన ఇళ్లపనులు శరవేగంగా సాగుతున్నాయి. జగనన్న కాలనీలతో నవాబుపేటలో మరో కొత్త ఊరు ఏర్పడుతోంది. జలజీవన్ మిషన్ నిధులు రూ.69 లక్షలతో మంచినీటి పైపులైన్ పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. నవాబుపేట-జయంతిపురం రోడ్డు జగనన్న పాలనలో ఎమ్మెల్యే ఉదయభాను ద్వారా సాధ్యమైంది.

గింజుపల్లి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ వరలక్ష్మి మృతి బాధాకరం



మండవ వరలక్ష్మికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్



వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్, మున్సిపల్‌సిబ్బంది

నందిగామ టౌన్: నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి మృతి బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని గరికపాటి నగర్‌లో గురువారం వారు వరలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ మున్సిపాలిటీ అభివృద్ధికి వరలక్ష్మి అందించిన సహకారం మరువలేనిదన్నారు. నిబద్ధత కలిగిన నాయకురాలని కొనియాడారు. వరలక్ష్మి మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ తన సోదరి సమానురాలైన వరలక్ష్మి మృతి ఎంతో బాధగా ఉందన్నారు. ఎప్పుడు కలిసినా సొంత తమ్ముడిలా తనను ఎంతో ఆప్యాయంగా పలకరించే వరలక్ష్మి మృతిచెందడం తమను కలిచివేసిందని చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి అంతిమయాత్రలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. వరలక్ష్మికి నివాళులర్పించినవారిలో నాయకులు మంగునూరు కొండారెడ్డి, దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, చల్లా బ్రహ్మేశ్వరరావు, పాకాలపాటి కిరణ్, గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఓర్సు జ్వాలా పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో వరలక్ష్మి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



జుజ్జూరులో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు కీర్తిసౌజన్య



పెనుగంచిప్రోలులో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

జుజ్జూరు(వీరులపాడు): ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వీరులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య సూచించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి కబడ్డీ పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తిసౌజన్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనారాయణ, పీఈటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సచివాలయం స్థాయిలో ముగిసిన క్రీడల అనంతరం స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మండల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో పెనుగంచిప్రోలుతోపాటు అనిగండ్లపాడు, శివాపురం, ముచ్చింతాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హర్షసాయి, పీడీ వేగినేటి వెంకటరమణ, బాబూప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి సీఎం జగన్

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



గండేపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల(వీరులపాడు): గత పాలకుల మాదిరిగా కాకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. కంచికచర్ల మండలంలోని గండేపల్లిలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో రాణించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు మాత్రమే సొంతమైన ఇంగ్లిష్ మీడియం చదువులను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఏకై క ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ప్రతి ఒక్క సంక్షేమ పథకంలో మహిళలను భాగస్వాములను చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పథకాల అమలులో సైతం ఎటువంటి అవకతవకలకు, అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేయటమే కాకుండా అన్ని విధాలుగా అండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో ఆయన మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు అందరూ అండగా ఉండాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ మట్టా శ్రీనివాసరెడ్డి, నాయకులు రంగారావు, బాలాజీ, శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

29న పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పరీక్ష ప్రజ్ఞ వికాసంకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞ వికాసం పేరుతో పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత పరీక్ష పేపర్ తయారు చేయించామని తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్ష రాయడం ద్వారా పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరూ ఈ పరీక్షను ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9394755525, 8790865130, 9010849524 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

వేమన పద్యం సదా స్మరణీయం



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

గుణదల (విజయవాడ తూర్పు): జీవిత సారాన్ని పద్య రూపంలో సమకూర్చి భావి తరాలకు నీతి మార్గాన్ని బోధించిన ఘనత వేమనకు దక్కుతుందని మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సీతారామిరెడ్డి అన్నారు. ఈ నెల 19వ తేదీన వేమన జయంతి సందర్భంగా ఆంధ్రలయోల కళాశాలలో విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యం భావి తరాలకు మార్గదర్శకమని తెలిపారు. విలాస జీవితాన్ని విడిచిపెట్టి వైరాగ్యంతో కూడిన నీతి జీవితాన్ని అనుభవించిన యోగి వేమన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన రూపొందించిన పద్యాలలో నీతి సూత్రాలు ఇమిడి ఉన్నాయని చెప్పారు. ఉపమానంతో కూడిన వేమన పద్యాలు సులువైన వాడుక భాషలో రాశారని తెలిపారు. పండిత పామరులకు సైతం అర్థమయ్యేలా వేమన శతకం ప్రజాదరణ పొందిందని అభిప్రాయపడ్డారు. సుమారు ఐదు దశాబ్దాలకు పైగా వేమన శతక పద్యాలు తెలుగు సాహిత్యంలో, పాఠ్యాంశాలుగా ఉన్నాయని వివరించారు. 30 మంది విద్యార్థులు పోటీల పాల్గొన్నారు. వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలాపించి గురువుల మన్ననలు పొందారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు అందజేత



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారు. దేవదాయ శాఖ తన వైబ్‌సైట్‌లో సాఫ్ట్‌వేర్‌ను బుధవారం రాత్రి అప్‌డేట్ చేసింది. అయితే కొత్త సాఫ్ట్‌వేర్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దర్శన టికెట్ల జారీలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మహా మండపం దిగువన కౌంటర్లతో పాటు ఘాట్‌రోడ్డు, స్కానింగ్ పాయింట్ వద్ద కౌంటర్లలో టికెట్ల జారీ నిలిచిపోయింది. దీంతో దేవస్థాన సిబ్బంది టికెట్ల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల ద్వారా ఆలయ ఈవో కెఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు గురి కాకుండా వెంటనే పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లను జారీ చేయాలని టెక్నికల్ టీమ్‌కు సూచించారు. దీంతో గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్ వద్ద పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారు.

74 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: మండలంలోని ఆయా చోట్ల నందిగామ పోలీసులు తనిఖీలు నిర్వహించి 74 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని రైతుపేట సమీపంలో 21 మద్యం సీసాలు, లింగాలపాడులో 19, దాములూరులో 34కలిపి మొత్తం 74 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఐదుగురికి గాయాలు

నందిగామ: ఓ ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఐదుగురికి స్వల్ప గాయాలైన ఘటన గురువారం నందిగామ మండల పరిధిలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం 10 మంది ప్రయాణికులతో నందిగామ నుంచి హనుమంతుపాలెం వెళ్తున్న ఆటో మార్గమధ్యంలో అదుపుతప్పి పల్టీ కొట్టింది.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఆటోను ఢీకొట్టిన కారు



నందిగామ: పట్టణంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఓ కారు, ఆటో ఢీ కొన్నాయి. సేకరించిన సమాచారం ప్రకారం విజయవాడ వైపు నుంచి వస్తున్న ఓ కారు పట్టణంలోని ముక్కపాటి కాలనీ సమీపంలో ఓ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో, కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. ప్రమాదానికి సంబంధించి తమకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

తిరుమలగిరి ఆలయ చైర్మన్‌గా 'కొమరగిరి'

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయ పాలకవర్గాన్ని నియమిస్తూ దేవాదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆలయ ఏసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు గురువారం తెలిపారు. తొమ్మిది మంది సభ్యులతో పాటు ఒక కోఆప్షన్ సభ్యుడిని నియమించాలని ఆదేశాలు అందినట్లు వివరించారు. సభ్యులుగా కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, వెంకటేశ్వర్లు, ఎల్.రాంబాబు, సీహెచ్ నరసింహారావు, జయమ్మ, సరస్వతీదేవి, మంగ, రమాదేవి, రమలను నియమిస్తూ ఉత్తర్వులు అందాయన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో పాలకవర్గ ప్రమాణస్వీకారం జరగనుండగా, చైర్మన్‌గా కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ పేరుతో ప్రతిపాదనలు అందినట్లు ఆయన వివరించారు.

21న యోగా థెరపీ పుస్తకావిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: యోగాచార్య సంపత్‌కుమార్ రచించిన 'యోగా సర్వవ్యాధి నిరోధక' అనే పుస్తకాన్ని ఈనెల 21న గుంటూరులో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చేతుల మీదుగా ఆవిష్కరింపజేయనున్నట్లు స్థానిక సూర్య యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కరణం లుగేంద్ర పిళ్లై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్య యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన ఈ పుస్తకం యోగా బోధించే టీచర్లందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. పుస్తకావిష్కరణతోపాటు యోగారంగంలో విశేష కృషి చేస్తున్న పలువురిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. అందరూ హాజరుకావాలని కోరారు.